సమస్త జనులకు సమానంగా ప్రయోజనాలు

- సిఎం కెసిఆర్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమష్టి ప్రయోజనం కోసం వ్యక్తిగత స్వార్థాన్ని విడిచి త్యాగాలకు సిద్ధపడ్డప్పుడే సమాజ హితం జరుగుతుందని సిఎం కెసిఆర్ అన్నారు. త్యాగాల ద్వారా ప్రాప్తించిన ప్రయోజనాలు సమస్త జనులకు సమానంగా అందినప్పుడే ఆ త్యాగాలకు సార్థకత చేకూరుతుందనే సందేశాన్ని బక్రీద్ పండుగ విశ్వ మానవాళికి అందిస్తోందని తెలిపారు.

బక్రీద్ (ఈదుల్ అజ్ హా) పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు సిఎం కెసిఆర్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగ భక్తి, త్యాగం, కరుణ, విశ్వాసం అనే గొప్ప గుణాలను ప్రజల్లో పెంపొందిస్తుందని సిఎం కెసిఆర్ అన్నారు.

సకల మత విశ్వాసాలను, సాంప్రదాయాలను గౌరవిస్తూ తెలంగాణ రాష్ట్రంలో పాలన కొనసాగుతున్నదని సిఎం అన్నారు. అన్ని వర్గాల ప్రజలు శాంతియుతంగా కలిసిమెలసి జీవించేలా, గంగ జమున తహజీబ్‌ను కాపాడుకుంటూ తెలంగాణ ఆధ్యాత్మిక పరంపరను కొనసాగిస్తున్నామన్నారు. దేశానికే ఆదర్శవంతమైన లౌకిక ఆధ్యాత్మిక కార్యాచరణ రాష్ట్రంలో అమలవుతుందని తెలిపారు. ఇస్లాం సహా మైనారిటీ మతస్తుల అభివృద్ధి సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని వివరించారు. అల్లా దయ ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

1, 2 తేదీల్లో సిఎస్ఐ కాన్ఫరెన్స్

హైదరాబాద్ : జులై 1,2 తేదీల్లో కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్ఐ) కాన్ఫరెన్స్‌ను హైదరాబాద్‌లో నేషనల్ ఇంటర్వేన్షనల్ కౌన్సిల్ (ఎన్ఐసి) నిర్వహించనుంది. రెండ్రోజుల పాటు హెచ్ఐసిసిలో జరగనున్న ఈ సమావేశంలో ఇంటర్వెన్షనల్ కార్డయాలజీలోని తాజా పురోగతిని చర్చించనున్నట్లు సిఎస్ఐ ఎన్ఐసి 2023 ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్ కస్తూరి, టిఎస్ సిఎస్ఐ మాజీ అధ్యక్షులు డాక్టర్ రాజీవ్ గార్గ్, ప్రస్తుత అధ్యక్షులు డాక్టర్ డాక్టర్ విఎస్ రామచంద్ర, ట్రెజరర్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి తెలిపారు. నగరంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2018 తర్వాత తొలిసారి ఈ కాన్ఫరెన్స్‌ను నగరంలో నిర్వహిస్తున్నామన్నారు. దీనికి దాదాపు మూడు వేల మంది జాతీయ, అంతర్జాతీయ కార్డియాలజిస్టులు హాజరుకానున్నారన్నారు.

హస్తినలో తెలంగాణ రాజకీయాలు

- అధిష్టానం సమక్షంలో కాంగ్రెస్, బిజెపి నేతల వ్యూహరచన
- ఇరుపార్టీల నేతలూ ఢిల్లీలో మకాం
- ఆఘమేఘాల మీద ఢిల్లీకి బండి
- ఎమ్మెల్యే జగ్గారెడ్డికి ఎఐసిసి పిలుపు
- అమిత్ షాతో మంత్రి కెటిఆర్ రహస్య భేటీ!

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర రాజకీయాలకు కాంగ్రెస్, బిజెపి పార్టీలు పదును పెడుతున్నాయి. తెలంగాణ ఎన్నికలకు ఢిల్లీలో వ్యూహ రచనలు చేస్తున్నాయి. అధిష్టానాల సూచనమేరకు ప్రత్యర్థి పార్టీల ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నాయి. గ్రూపుగా, విడివిడిగా చర్చించి ఏం చేయాలో ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బిజెపి పార్టీలకు చెందిన నేతలు రెండు రోజులుగా ఢిల్లీలో బిజీబిజీగా గడుపుతున్నారు. బిఆర్ఎస్ మంత్రులు కూడా హస్తినలో కేంద్ర పెద్దలను కలిసిన సంగతి తెలిసిందే.

రేవంత్ బృందంతో సుదీర్ఘ చర్చలు

కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైన ఇద్దరు బలమైన నేతలతో చర్చించేందుకు రేవంత్ నేతృత్వంలో ఓ బృందం ఢిల్లీ వెళ్లింది. ఈ సందర్భంగా రానున్న ఎన్నికలు, చేరికలు, బహిరంగసభలు, ఎన్నికల్లో అనుసరించాల్సిన పద్ధతులపై సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ రెండ్రోజులపాటు రాష్ట్రంపై ఫోకస్ చేశారని ఆ వర్గాలు చెప్పాయి. కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలపై అధిష్టానం సీరియస్ అయినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా, రానున్న ఎన్నికల్లో పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ నేత మధుయాష్కీ గౌడ్ ఢిల్లీలో చెప్పారు. టికెట్ల విషయంలో అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

ఢిల్లీకి బండి.... హైదరాబాద్‌కు ఈటల, కోమటిరెడ్డి

బిఆర్ఎస్‌ను ఓడించి అధికారంలోకి వచ్చేందుకు బిజెపి చీఫ్‌ను కార్యాచరణ లేదని అసంతృప్తులు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ క్రమంలోనే బండి సంజయ్‌ని ఆఘమేఘాల మీద ఢిల్లీకి రప్పించిన సంగతి తెలిసిందే. నాయకుల పట్ల బండి వ్యవహరిస్తున్న తీరును అమిత్‌షా తప్పుపట్టినట్టు వార్తలొచ్చాయి. పార్టీలో చేరిన వారికి సరైన గౌవరం ఇవ్వాలని తెలియదా? అంటూ ఘాటుగానే మందలించినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ సమయంలో హస్తినలోనే ఉన్న ఈటల, రాజగోపాల్‌రెడ్డిలను బండి సంజయ్ కలవలేదు. వారిద్దరూ తిరిగి హైదరాబాద్‌కు వచ్చారు. ఈ క్రమంలో బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా హస్తం గూటికి చేరుతారనే చర్చ మొదలైంది. ఆ సమయంలో వారిద్దరూ ఢిల్లీలో అమిత్‌షా, నడ్డాతో భేటీ అయి, బిజెపి అంతర్గత విషయాలను వారికి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. దీంతో వారి మధ్య విభేదాలు తారాస్థాయిలో ఉన్నాయని ఆ వర్గాలు అంటున్నాయి. తెలంగాణలో ఇప్పటి వరకూ బిజెపి బలోపేతానికి ఏ చిన్న అవకాశం వచ్చినా సద్వినియోగం చేసుకున్న కమలనాథులు... కవితను అరెస్ట్ చేసే విషయంలో అచీతుచీ వ్యవహరిస్తుండటంతో బిఆర్ఎస్, బిజెపి మధ్య రహస్య ఒప్పందం ఉందంటూ కాంగ్రెస్ ఆరోపిస్తోంది. మరోవైపు ఈ మధ్య కేసీఆర్ పదేపదే కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తూ మాట్లాడుతుండటం, అదే బాటలో మంత్రులు, పార్టీ నేతలూ నడవడంతో లోలోపల ఏదో జరుగుతోందనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే పార్టీ మారేదిలేదంటూ ఈటలరాజేందర్ హైదరాబాద్‌లో ప్రకటించారు. ఆయన భార్య జమున తన భర్తను చంపేందుకు కౌశిక్‌రెడ్డి కుట్ర చేస్తున్నారంటూ ఆరోపించారు.

మంత్రి కెటిఆర్ ఇప్పుడే కేంద్రమంత్రులను ఎందుకు కలిశారు?

మంత్రి కెటిఆర్ ఉన్నట్టుండి ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలవడంపై ఊహాగానాలు మరింత ఊతమిస్తున్నాయి. ఆయన పర్యటనలో మరో ఆసక్తిరమైన చర్చ చోటు చేసుకుంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మంత్రి కెటిఆర్‌కు అపాయింట్‌మెంట్ ఇచ్చినట్టు ప్రచారమైంది. వెనువెంటనే అమిత్‌షా అపాయింట్‌మెంట్ రద్దు అయినట్టు తెలియజేశారు. బిఆర్ఎస్, బిజెపి ఒక్కటే అన్న ప్రచార నేపథ్యంలో బహిరంగంగా అపాయింట్‌మెంట్ రద్దు చేసి, రహస్యంగా భేటీ అయ్యారనే ప్రచారం జరుగుతున్నది. ఆ తర్వాతనే బిఆర్ఎస్‌పై విమర్శలు చేయడంలో బిజెపి నేతల నోర్లు మూతపడ్డాయని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. కాంగ్రెస్, బిజెపి నేతలు హస్తిన వేదికగా రాజకీయాలకు పదును పెడుతున్నారు. ఒకవైపు బిఆర్ఎస్ ఢిల్లీ రాజకీయం నడుపుతూనే... రాష్ట్రంలోనే కాదు... మహారాష్ట్రలోనూ కారు బలాన్ని చూపించేందుకు భారీ కాన్వాయ్‌తో సోలాపూర్‌కు వెళ్లారు. అంతేకాకుండా కాంగ్రెస్ నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జగ్గారెడ్డి కూడా కారెక్కుతారనే ప్రచారం జరిగింది. ఈ విషయాన్ని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఖండించారు. ఎమ్మెల్యే జగ్గారెడ్డిని హడావుడగా ఢిల్లీకి పిలిపించారు. కాంగ్రెస్ అంతర్గత విషయాలపై ఆయన రాహుల్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. పదే పదే రేవంత్‌రెడ్డిపై ఆయన చేస్తున్న వ్యాఖ్యల నేపథ్యంలో అధిష్టానం అడిగి తెలుసుకున్నట్టు ఆ వర్గాలు చెప్పాయి. ఢిల్లీకి చేరిన రాష్ట్ర రాజకీయాలు రాష్ట్రానికి చేరిన తర్వాత ఎటువంటి పరిణామాలు జరుగుతాయో వేచి చూడాల్సిందే.

క్లిష్ట సమయంలో దేశాన్ని కాపాడిన పివి

- సిఎం కెసిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

క్లిష్ట సమయంలో దేశాన్ని కాపాడిన మహానేత పివి నర్సింహారావు అని ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు కొనియాడారు. నాడు ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలాలే నేడు దేశ ప్రజల అనుభవంలోకి వచ్చాయని తెలిపారు. భారత మాజీ ప్రధాని పివి 102వ జయంతి సందర్భంగా బుధవారం ఆయన సేవలను కెసిఆర్ స్మరించుకున్నారు. స్థితప్రజ్ఞతతో భారతదేశాన్ని ప్రపంచ అగ్రదేశాల సరసన నిలిపేందుకు పునాది వేసిన దార్శనికుడు అని గుర్తు చేశారు. 'దేశానికి మౌనంగా మేలు చేసిన భారత ప్రధాని పివి నర్సింహారావు' అని పేర్కొన్నారు. పలు సంస్కరణలతో భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడిన ఘనత తెలంగాణ బిడ్డ పివి నర్సింహారావుకే దక్కుతుందని తెలిపారు.

వారి సేవలను సమున్నతంగా గౌరవించుకునే బాధ్యత మన మీద ఉన్నదని పేర్కొన్నారు. వారి గొప్పతనాన్ని గుర్తించుకునేందుకు వారి జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని వివరించారు. 'తెలంగాణ ఠీవి మన పివి' అనిపునరుద్ఘాటించారు. వారి స్ఫూర్తితో దేశాభివృద్ధి దిశగా ముందుకు సాగుతామని తెలిపారు.

అసెంబ్లీలోనూ...

అసెంబ్లీలోని ఆయన నిలువెత్తు చిత్రపటానికి పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ మాట్లాడుతూ దేశంలో అనేక సంస్కరణలు తెచ్చిన గొప్ప ప్రధాని పివి నరసింహారావు అని తెలిపారు. తన ఆలోచన విధానంతో దేశానికి మార్గాన్ని చూపారని చెప్పారు.. శాసనసభ చీఫ్ విప్ వినయ్ భాస్కర్, పివి కూతురు ,ఎమ్మెల్సీ వాణి దేవి, ఎమ్మెల్సీ యల్.రమణ తదితరులు నివాళులర్పించారు.

గాంధీభవన్‌లో...

గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, పార్టీ నేతలు పొన్నాల లక్ష్మయ్య, అనిల్‌కుమార్ యాదవ్, వినోద్‌కుమార్, కల్వసుజాత ఆయన సేవలను స్మరించుకున్నారు. పీవీ ఘాట్ వద్ద మాజీ ఎంపి మల్లు రవి, నాయకులు హర్కర వేణుగోపాల్ నివాళులర్పించారు.

ఉస్మానియా ఆస్పత్రి పరిస్థితి ఆందోళనకరం : రాష్ట్ర గవర్నర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంతో గొప్ప చరిత్ర కలిగిన ఉస్మానియా ఆస్పత్రి దుస్థితి చూస్తే ఆందోళన కలుగుతోందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి సంబంధించి గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలుపుకోవాలని కోరుతూ 'జస్టిస్ ఫర్ ఓజీహెచ్' పేరుతో ఉన్న ఓ ట్విటర్ ఖాతాకు ఆమె రీట్వీట్ చేశారు. ఆస్పత్రిలో రోగులు పడుతున్న ఇబ్బందులకు సంబంధించిన ఫొటోలతో పాటు.. కొత్త భవన నిర్మాణానికి జాయింట్ అసోసియేషన్ విడుదల చేసిన లేఖకు సంబంధించిన ఫొటోలు ట్వీట్‌కు జత చేశారు. ఎంతో మందికి అత్యంత మెరుగైన వైద్య సేవలు అందించిన చరిత్ర ఉస్మానియా ఆస్పత్రికి ఉందని గుర్తుచేశారు. ఆస్పత్రి నూతన భవన నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

నాకు ఏం జరిగినా కెసిఆర్‌దే బాధ్యత

- ఎమ్మెల్యే ఈటల రాజేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సైకో కౌశిక్ రెడ్డిని ముఖ్యమంత్రి ప్రోత్సహిస్తూ హత్య రాజకీయాలకు పాల్పడుతున్నారని, తనకు ఏం జరిగినా సిఎం కెసిఆర్‌దే బాధ్యత అని మాజీ మంత్రి, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలిపారు. వరంగల్ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి తనను హత్య చేసేందుకు కుట్రలు చేస్తున్నారని, అందుకు ప్రధాన కుట్ర దారి కెసిఆర్ అని ఆరోపించారు. కొన్ని రోజులుగా ఒక సైకో ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలను తిట్టడం, బెదిరించడం, అక్రమ కేసులు పెట్టడం జరుగుతుందని, దాంతో అతనిపై వరంగల్, కరీంనగర్ సిపిలకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఒక సర్పంచ్‌ని కూడా గతంలో జైలుకు పంపించారని ఆరోపించారు. హుజూరాబాద్, జమ్మికుంట చౌరస్తాల్లో ఎవరు తప్పు చేశారో తెలుసుకుందాం రా అని సవాల్ విసిరారు. నీతి నిజాయితీ ఉంటే ప్రతి అంశంపై దర్యాప్తు చేసి ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని అరెస్ట్ చేయాలని సిపిలను కోరారు. ఈటల రాజేందర్ తెరిచిన పుస్తకం అని, ఎవరికి ఎలాంటి హామీ చేయలేదని తెలిపారు గతంలో మాజీ నక్సలైట్ నహీం సాంబశివుని చంపినప్పుడు 100 సార్లు నన్ను హెచ్చరించారని, అయినా భయపడలేదని, ఇలాంటి వారికీ తాను భయపడనని స్పష్టంచేశారు. సమావేశంలో మాజీ సైనికులు డాక్టర్ మాచర్ల బిక్షపతి, నాయకులు కట్ల సదానందం, పిట్టల కుమార్, మారబోయిన సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బలమైన కుల సంఘాలకు భూములు ఎందుకివ్వాలి...?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
- కమ్మ, వెలమ సంఘాలకు కేటాయించిన భూములపై స్టే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కమ్మ, వెలమ సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం భూములు కేటాయించడంపై రాష్ట్ర హైకోర్టు స్టే విధించింది. కులాల వారీగా భూముల కేటాయింపును ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఇలా కేటాయించడమూ ఓ విధమైన కబ్జానే అని వ్యాఖ్యానించింది. ఆ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను ఆగస్టు రెండుకు వాయిదా వేసింది.

కమ్మ, వెలమ సంఘాలకు ఐదెకరాల చొప్పున భూములు కేటాయిస్తూ 2021లో రాష్ట్ర ప్రభుత్వం జిఒ జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ కెయు రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. భూముల కేటాయింపుపై ప్రభుత్వం జారీ చేసిన జిఒ సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా ఉందని చెప్పింది. అణగారిన వర్గాలకు భూములు ఇస్తే అర్థం చేసుకోవచ్చుని.. బలమైన కులసంఘాలకు భూములు ఇవ్వడం ఎందుకని ప్రశ్నించింది. సాయిసింధు ఫౌండేషన్‌కు భూకేటాయింపు రద్దు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా హైకోర్టు గుర్తుచేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు కమ్మ సంఘానికి ఉన్నత న్యాయస్థానం అనుమతించింది.

మహారాజశ్రీ నందిగామ సివిల్ జడ్జి వారి కోర్టులో
IA 295/2019 in OS 154/2018
Between:
సెట్టిపల్లి రామకృష్ణరావు జీ రామకృష్ణ - వాది
మరియు
1. సెట్టిపల్లి సూర్యారావు S/o నరసయ్య, 89 సం॥లు, హిందూ, వ్యవసాయం, అల్లూరు గ్రామం, వీరులపాడు మండలం, యన్.టి.ఆర్. జిల్లా, ఆంధ్రప్రదేశ్
2. సెట్టిపల్లి వెంకటరావు, S/o నరశింహారావు, 57 సం॥లు, హిందూ, వ్యవసాయం, అయ్యప్పరాజుగూడెం, లింగపాలెం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
3. చెలికంటి సావిత్రి, W/o మోహనరావు, 55 సం॥లు, హిందూ, గృహిణి, డోర్ నెం. 3-1-18, అశోక్‌నగర్, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా.
4. రెమిల్లె చిట్టెమ్మ, W/o సుబ్బారావు, 65 సం॥లు, హిందూ, గృహిణి, R/o C-86 రైటర్‌బస్తీ, కొత్తగూడెం టౌన్, భద్రాచలం జిల్లా, తెలంగాణ
5. జూపల్లి సత్యవతి, W/o నరసింహారావు, 63 సం॥లు, హిందూ, గృహిణి, డోర్ నెం. 5-278, నడిం తిరువూరు, యన్.టి.ఆర్. జిల్లా, ఆంధ్రప్రదేశ్
6. కోటగిరి పద్మావతి, W/o లేటు పాపారావు, 63 సం॥లు, హిందూ, గృహిణి, డోర్ నెం. 2-8-31, వెంగళరావునగర్, సత్తుపల్లి టౌన్, తెలంగాణ.
7. కోటగిరి రమాదేవి, W/o లేటు లక్ష్మణరావు, 61 సం॥లు, డోర్ నెం. 3-89, పాతకొత్తగూడెం, తెలంగాణ.
8. సెట్టిపల్లి సత్యనారాయణ, S/o Late వెంకటరామారావు, 66 సం॥లు, హిందూ, స్థిరాస్తిదారుడు, R/o. A-2 సాయి అపార్టుమెంట్స్, రామయ్యపేట, కాకినాడు టౌన్, తూర్పుగోదావరి జిల్లా , ఆంధ్రప్రదేశ్.
9. తాండ్రా విజయలక్ష్మి, W/o నరసింహారావు 62 సం॥లు, హిందూ, గృహిణి, డోర్ నెం. 5-2-4, చందానగర్, హైదరాబాద్, తెలంగాణ.
10. కోటగిరి ఇందిరాదేవి, W/o సూర్యప్రకాశరావు, 60 సం॥లు, హిందూ, గృహిణి, డోర్ నెం. 2-1-82, హైదరాబాద్, తెలంగాణ. - ప్రతివాది
ప్రకటన
ది. 21-7-2023 తారీకున పైన తెలిపిన IA No. 295/2019 మరియు O.S.No. 154/2018 దావాలో 6,7 మరియు 8వ రెస్పాండెంట్స్/ప్రతివాదులకు ఎట్టి అభ్యంతరములు ఉన్నచో తెలుపుకునే నిమిత్తము పైన కోర్టు వారి ఎదుట ఉ. 10.30 ని॥లకు వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజున హాజరుకాని యెడల కోర్టువారు మీ పరోక్షమున దావాలో తీర్మానించుట జరుగును.
వేమూరు సత్యనారాయణమూర్తి
వేమూరు వెంకటలక్ష్మి నరసింహ పూర్ణేష్
వాది తరపున అడ్వకేట్స్, నందిగామ
నందిగామ, ది. 28-06-2023

బిజెపి అధికార ప్రతినిధిలా తప్పుడు ఆరోపణలు

- గవర్నర్ తమిళిసై ట్వీట్‌పై మంత్రి హరీశ్ రావు వ్యాఖ్య
- కోర్టు పరిధిలో ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగ పదవిలో ఉన్న రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ బిజెపి అధికార ప్రతినిధిలా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని కోఠిలో పునరుద్ధరించిన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయంతో పాటు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణ అంశం హైకోర్టు పరిధిలో ఉందని, ఒకసారి తీర్పు వచ్చాక ఆధునాతనమైన భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు. గవర్నర్ వ్యాఖ్యలు కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్టు...తప్పుల కోసం భూతద్దంలో వెతికినట్టున్నాయని విమర్శించారు. ఆ వ్యాఖ్యలు దురదృష్టకరమంటూ విచారం వ్యక్తం చేశారు. ఉస్మానియా ఆస్పత్రిపై మొదట స్పందించింది సిఎం కెసిఆర్ అని తెలిపారు. 2015 జూలైలో సిఎం ఆస్పత్రిని సందర్శించి, నూతన భవన నిర్మాణానికి రూ.200 కోట్లు ప్రకటించారని గుర్తుచేశారు. అయితే కొంత మంది అదే ఏడాది ఆగస్టులో కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారని, అప్పట్నుంచి ఆ అంశం న్యాయవివాదంలో ఉందని వివరించారు. కోర్టు ఆదేశాల మేరకు ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్,

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హరీశ్

ఐఐటి హైదరాబాద్ నిపుణులతో ప్రభుత్వం వేసిన స్వతంత్ర కమిటీ ప్రస్తుత భవనం ఆస్పత్రి నిర్వహణకు పనికి రాదని నివేదిక ఇచ్చిందని తెలిపారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం కోర్టు చెప్పిందని తెలిపారు. కోర్టు నుంచి సానుకూలమైన తీర్పు వస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

కేంద్రం ఒప్పుకున్నా.... గవర్నర్ అభినందించదెందుకు?

దేశంలో వంద శాతం ఆస్పత్రి డెలివరీలు జరుగుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కేంద్రం చెప్పినా గవర్నర్ అభినందించదెందుకు? అని హరీశ్ రావు ప్రశ్నించారు. "ప్రభుత్వాస్పత్రుల్లో డెలివరీలను 30 శాతం నుంచి 70 శాతానికి పెంచి సీన్ రివర్స్ చేశాం. కంటివెలుగు రెండో దశ కార్యక్రమంలో 1.62 కోట్ల మందికి పరీక్షలు, 45 లక్షల మందికి కళ్లద్దాల పంపిణీ చేశాం. నిమ్స్ ఆస్పత్రిలో పడకల సంఖ్యను 900 నుంచి 1,500కు పెంచాం. మరో రెండు వేల పడకలతో విస్తరిస్తున్నాం. కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ వంటి పథకాలతో మాతా, శిశు మరణాలను -తగ్గించాం. 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు' అనే పరిస్థితి నుంచి 'నేను పోతా బిడ్డ సర్కార్ దవాఖానకు' అనే స్థాయికి చేర్చాం. గతంలో 20 ఏండ్లకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తే, తొమ్మిదేళ్లలో 21 కాలేజీలు ఏర్పాటు చేశాం. లక్ష జనాభాకు 22 ఎంబిబిఎస్ సీట్లతో దేశంలో మొదటి స్థానంలో ఉన్నాం. డయాలసిస్ సెంటర్లను మూడు నుంచి 102కు పెంచాం. నిటిఅయోగ్ ర్యాంకుల్లో మూడో స్థానానికి చేరాం. బస్తీ దవాఖానాలను నిటిఅయోగ్ ప్రశంసించింది. బోధనాస్పత్రుల్లో ఒపి తగ్గించి, ఆ ఆస్పత్రులపై ఒత్తిడి తగ్గించాం. గాంధీ, నిమ్స్, ఉస్మానియా ప్రభుత్వాస్పత్రుల్లో అవయవమార్పిడి శస్త్రచికిత్సలు చేస్తున్నాం.... " అని మంత్రి హరీశ్ రావు వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అనేక మంచి కార్యక్రమాలను నిర్వహించినప్పటికీ గవర్నర్ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని గానీ, కనీసం వైద్యారోగ్యశాఖ సిబ్బందిని గానీ అభినందించేందుకు ఆమెకు మనసెందుకు రాలేదో అర్థం కావడం లేదన్నారు. ఈ విషయాలపై గవర్నర్ ఎందుకు స్పందించరు? ఒక డాక్టర్‌గా కనీసం గవర్నర్ అభినందించాలి కదా?. ప్రశంసిస్తే మేమింకా ఉత్సాహవంతంగా పనిచేస్తాం కదా? అని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి కనబడదు, మంచి వినబడదు. మంచి మాట్లాడను అన్నట్టుగా వ్యవహరిస్తే ఎలా? అని ప్రశ్నించారు. చెడును మాత్రమే చూస్తాం. చెడు మాత్రమే వింటాం. చెడు మాత్రమే మాట్లాడతాం.. అన్నట్టుగా వ్యవహరించడం రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న గవర్నర్‌కు తగదని హితవు పలికారు.

IN THE COURT OF THE MACT CUM CHIEF JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD
O.P.No. 1953 OF 2021
BETWEEN:
Muthyala Venkataramana and another. ...Petitioners.
And
TSRTC and Others. ...Respondents.
To,
B. Lingamallu, S/o. Aulaiah, aged major, Occ: Driver, R/o. 6-15, Ogodu, Nakrekal, Nalgonda District 508 211. ...Respondent No.3
Please take notice that the Petitioners have filed the above O.P for compensation for the death of Muthyala Trimurthulu @ Murthy, in a road accident caused by your TSRTC bus bearing NO. TS 29Z 0033 on On 21.06.2021 at about 9.00 PM. The said O.P. is posted to 26.07.2023 at 10.30 AM for your appearance and counter. Kindly make it convenient to be present on the said date befoe the Hon'ble Court by 10.30 AM in person or through your counsel. Otherwise the matter will be decided in your asbsence.
Hence this notice
BY ORDER OF THE COURT
M. VIJAY REDDY
ADVOCATE
2-2-647/A/58, Saibabanagar, Shivam Road, Bagh, Amberpet, Hyderabad Ph:767390459
9330489999

BEFORE THE KARNATAKA STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION, BASAVA BHAVAN, BANGALORE-560 001
Complaint No.207 & 221/2022 & CC/10/2023
Sl.No. 01. CC No: CC/207/2022, Complainant: Sri Naveen Kumar .P, S/o Sri Prabhakar kumar & Others. Opposite Party: Sri. Jagadeesha Reddy & Others
Sl. No. 02. CC.No. CC/221/2022 Complainant: Sri. Bala Murali Krishna Tandasa, S/o Sri Sudarsana Rao T. Opposite Party Sri. Jagadeesha Reddy & Others
SL. No. 03. CC.No. CC/10/2023. Complainant: Sri Ramesh Gummadi, S/o Sri Siva Linga Prasad Gummadi, Opposite Party Sri. Jagadeesha Reddy & Others
To, 17. M/s Sri Sai Mourya Estates & Projects Private Limited. Having its registered office at No. 1158. MLA's Colony, Road No.12, Banjara Hills, Hyderabad-500034, Rep. by its Executive Director Sri. V. Suresh Reddy.
NOTICE TO THE OPPOSITE PARTY NO. 17 FOR HEARING OF COMPLAINT
Whereas the complainant has filed the complaint against Opposite Party No.17 under section 17 of the Consumer Protection Act claiming reliefs. You are hereby notified to appear before this Hon'ble Commission in person or through a pleader or person authorized as per law to answer all the material question of facts and law relating to the Complaint on 28/07/2023 at 11:00 A.M.
Take notice that in case of default of your appearance on the day mentioned above complaint will be heard and determined in your absence as per law.
Given under the hand and seal of this Commission on this 22/06/2023
By order of the Commission, Asst. Registrar Cum Asst. Admn. Officer, K.S.C.D.R.C, Bangalore-560001.
Advocate for Complainant:
PRASHANTHI .A.L & ASSOCIATES
No. 25 & 26, B-303, 3rd Floor, Brigade Majestic, 1st Main Road, Gandhinagar, Bangalore-560009.

రెండు కొత్త మండలాల ఏర్పాటు

- ఆయా గ్రామాలను సరిహద్దు జిల్లా, మండలాల్లోకి మార్పు
- ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూ శాఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రెండు కొత్త మండలాలను ఏర్పాటు చేస్తూ రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. కొత్త మండలాలతో పాటు పరిపాలన సౌలభ్యం, అభివృద్ధి దృష్ట్యా కొన్ని గ్రామాలను సరిహద్దు మండలాలతోపాటు జిల్లాల్లోకి కూడా మార్చారు. మార్పులు, చేర్పులు రెవెన్యూ శాఖ ప్రతిపాదనలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. కొత్త మండలాల ఏర్పాటు, గ్రామాల మార్పునకు సంబంధించిన ఏమైనా అభ్యంతరాలు ఉంటే 15రోజుల్లో తెలియజేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి డివిజన్ చిట్యాల మండలంలోని గిద్దెముత్తారం, కల్వపల్లే గ్రామాలతోపాటు పెద్దపల్లి జిల్లాలోని మంథని డివిజన్ ముత్తారం మండలంలోని శాంతరాజుపల్లిని జయశంకర్‌భూపాలపల్లి జిల్లాకు చెందిన టేకుమట్ల మండలంలో కలపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే జిల్లాలో కొత్తపల్లిగోరి అనే కొత్త మండలాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఉన్న రేగొండ మండలంలోని కొత్తపల్లిగోరి, చెన్నపూర్, చెన్నకొడేపాక, జగ్గయ్యపేట, సుల్తాన్‌పూర్, జంషెడ్‌బేగ్‌పేట్, కొనరావుపేట్ గ్రామాలను కొత్తపల్లిగోరి మండలానికి కేటాయించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్‌లో కొత్తగా ఇర్విన్ మండలాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఉన్న మాడ్గుల మండలంలోని ఇర్విన్, బ్రాహ్మణపల్లి, ఆర్కపల్లి, అందుగుల, అన్నెబోయినపల్లి, సుద్ధపల్లి, గిరికొత్తపల్లి, కలకొండ, రమణంపల్లి గ్రామాలను ఇర్విన్ మండలానికి కేటాయించింది. ఏ ా న్మ కొ ం ఢ జిల్లాలోని వేలేర్ మండలంలోని కన్నారం, ఎర్రబెల్లి గ్రామాలను అభివృద్ధి దృష్ట్యా వేర్వేరు జిల్లాల్లోకి మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. కన్నారం గ్రామాన్ని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్‌లోని అక్కన్నపేట మండలంలోకి మార్చనుంది. ఎర్రబెల్లి గ్రామాన్ని హన్మకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలంలోకి మార్చనుంది.

సమస్యలు పరిష్కంచమంటే.. ఈడ్చేశారు

- పోలీసులు జోక్యంతో కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం
- కలెక్టరేట్ గేటు ఎదుట విద్యార్థుల బైటాయింపు
- నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు : ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రయివేటు స్కూళ్లలో ఫీజులు తగ్గించి, ప్రభుత్వ స్కూళ్లలో వసతులు పెంచాలని, యూనివర్శిటీలను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో బుదవారం చేపట్టిన చలో కలెక్టరేట్ తీవ్ర ఉద్రిక్తంగా మారింది. సమస్యలు పరిష్కరించే వరకు కదిలేది లేదని సుమారు గంటపాటు కలెక్టరేట్ గేటు ఎదుట భీష్మించు కూర్చున్నారు. ప్రతిసారీ వినతిపత్రాలు సమర్పించడమే తప్ప సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధిగా లేదని విద్యార్థి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పష్టమైన హామీ ఇవ్వాలని భీష్మించారు. నిజామాబాద్ కలెక్టరేట్ గేటు వద్ద రాకపోకలు అడ్డుకుని పెద్దఎత్తున నినదించారు. ఈ సమయంలో కలెక్టరేట్ నుంచి వెళ్లకపోతే కేసులు పెడతామని పోలీసులు విద్యార్థులను హెచ్చరించారు. అయినప్పటికీ విద్యార్థులు ఆందోళన కొనసాగించారు. దాంతో పోలీసులు, విద్యార్థులకు మధ్య తీవ్ర తోపులాట జరగడంతో పోలీసులు.. విద్యార్థి నాయకులను ఈడ్చేశారు. బలవంతంగా అరెస్టు చేసి రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఈ ఆందోళనలో పాల్గొన్న ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వందలాది మంది విద్యార్థులు కలెక్టరేట్ గేటు ఎదుట బైటాయించి సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టళ్లలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికీ పూర్తిస్థాయిలో పుస్తకాలు, దుస్తులు పంపణీ చేయలేదని తెలిపారు. మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. స్కూళ్లలో టీచర్ల కొరత ఉందని, ఎంఇఒలు లేరని చివరకు స్కావెంజర్లనూ సర్కారు నియమించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ యూనివర్శిటీలను నీరుగారుస్తూ ఇష్టారీతిన ప్రయివేటు వర్సిటీలకు అనుమతి ఇస్తున్నారని విమర్శించారు. ఇటీవల గురునానక్ అనే ప్రయివేటు యూనివర్శిటీ అడ్మిషన్ల పేర లక్షలు వసూళ్లు చేసి నాలుగు వేల మంది విద్యార్థులను రోడ్డునపడేసిందని గుర్తు చేశారు. ఇక కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్రమోడీ నూతన విద్యావిధానం పేర కుల, మతాల మధ్య విద్వేషం నింపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫెలోషిప్‌లను నిలుపుదల చేస్తూ ఇబ్బందుల పాల్జేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేదోడికి, ఉన్నోడికి విద్యలో అసమానతలు తీసుకొస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యలపై పలుమార్లు వినతిపత్రం సమర్పించినా సమస్యలు పరిష్కారం కావడం లేదని, కలెక్టర్ వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, నలుగురు వచ్చి వినతిపత్రం సమర్పించి వెళ్లాలని పోలీసులు సూచించారు. దీనిపై నాయకులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ప్రధాన గేటు మూసివేశారు. అయినప్పటికీ.. విద్యార్థులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించడంతో పోలీసులు విద్యార్థులను ఈడ్చేశారు. అరెస్టు చేసి రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విఘ్నేష్, అనిల్, నగర కార్యదర్శి మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, నాయకులు విశాల్, యూనివర్శిటీ బాధ్యులు ప్రసాద్, సంధ్య, ఛత్రు, జోహార్‌సింగ్, సందీప్, శైలజ, నీలిమతో పాటు పలువురు విద్యార్థులున్నారు.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS (DISTRICT REGISTRAR) KURNOOL.
ARB. CLAIM PETITION No. 158/2020
Between:-
M/s. Kapil Chits Hyderadad Pvt. Ltd., Rept. by its Legal Officer .... Disputant
And
K.N. SHANTHARAM & Others ...Opponents
1. K.N.Santharam S/o. K N.Kistanna. Hindu aged about 50 years. Agriculturer& Finance Business. H.No: 1-17,Temple Street Waddepalli (m) Mandoddi Mahaboobnagar(Dt)T.S.
2. K.N,Kistanna, S/o.K.N.Ramanna , Hindu aged about 77 years. Agriculturer& Finance Business. H.No: 1-16, Mandoddi,Waddepalli (m)Mahaboobnagar(Dt)T.S.
3. N.Naresh Kumar, S/o. N.Venkataramulu. Hindu aged about 55 years. S.G.T.Primary School Mandal Educational Office Waddepally(M) Mahaboob Nagar. H.No.2-77/1 Naik Veedi Ramapuram(Post&Villege) Waddepally(M),Mahaboobnagar(Dt)T.S.
4. C.Srinivasulu Reedy, S/o. C.Linga Reedy, Hindu aged about 53 years. SrAsst.P J P Dam Division No-2,Nandimala Atmakur,Mahaboob Nagar H.No: Q,C No: A8,K.L.I Camp Gadwal, Mahaboob Nagar(Dt)T.S.
5. R.N.Naresh kuamr, S/o. R.N.Anjaneyulu, Hindu aged about 52 years. S.G.T Primary School, Chintakunta Of MP ,Pangal(M), Mahaboob Nagar.H.No:3-17, Ramapuram, Waddepalli (M),Mahaboob Nagar,(Dt).
NOTICE TO OPPONENTS No. 1 TO 5
WHEREAS the Disputant Chit Fund Company, in the above Dispute has instituted the above Dispute for recovery of money and the same is posted for your appearance in the said Court on the 19-07-2023 by 11:00 a.m. If you failed to attend the said Court on the said date, the matter will be heard and decided as Exparte.
//By the Order of the Deputy//
Registrar of Chits O/o. District Registrar Stamps & Registrations Dept. Kurnool
Place: Kurnool.
Date: -7-2023.

తప్పుదోవ పట్టించిన మంత్రి హరీశ్ రావు : హెచ్ఆర్‌డిఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణంపై వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు వాస్తవాలను పక్కదారి పట్టిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్ డీఏ) విమర్శించింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షులు కె.మహేశ్ కుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2009లో నాటి ముఖ్యమంత్రి రోశయ్య ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించారని తెలిపారు. 2014 తర్వాత ఉస్మానియా ఆస్పత్రికి సంబంధించిన బ్లూప్రింట్ గానీ లేదా ప్లాన్ గానీ లేదా నిధుల కేటాయింపునకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు కాని ఇవ్వలేదని తెలిపారు. గత నాలుగేండ్లుగా పాత వారసత్వ భవనంపై ప్రభుత్వం ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని? ప్రశ్నించారు. పాత భవనం కూల్చి వేసి లేదా కూల్చివేయకుండా కొత్త భన నిర్మాణంపై ప్రభుత్వ నిర్ణయమేంటని హైకోర్టు అడిగినా, గత నాలుగున్నరేండ్ల నుంచి ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని ప్రశ్నించారు. చివరిసారిగా 2022 డిసెంబర్ 13న కోర్టు, ప్రభుత్వ వైఖరి ఏంటని? అడిగి ఆరు నెలలు గడుస్తున్నా...ప్రభుత్వం నుంచి స్పందన లేదని విమర్శించారు. కోర్టు నిర్ణయం తీసుకుంటుందని వైద్యారోగ్యశాఖ మంత్రి చెప్పడం తప్పుదోవ పట్టించడమేనని పేర్కొన్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో సమీక్షలను ఆపి, కోర్టులో కొత్త బిల్డింగ్ బ్లూ ప్రింట్, అఫిడవిట్ దాఖలు చేసి, నిధులను కేటాయించి, నిర్దేశిత సమయంలో భవన నిర్మాణం పూర్తి చేసేందుకు పూనుకోవాలని కోరారు.

డీఎంఈకి వినతి...

ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవనాన్ని నిర్మించాలని జాయింట్ అసోసియేషన్ ఫర్ న్యూ ఒజీహెచ్ (హైదరాబాద్) కోరింది. ఈ మేరకు అసోసియేషన్ నాయకులు రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ కె.రమేశ్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. పాత భవనంలో వైద్యమందించడం ఇబ్బందికరంగా మారిందనీ, రోగులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు.

ఎసిబికి చిక్కిన ల్యాండ్ సర్వేయర్ ఎడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూమి నాలా కన్వర్షన్ చేసిన తర్వాత పంచనామ సర్టిఫికెట్ ఇవ్వడానికి లంచం తీసుకుంటూ ల్యాండ్ సర్వేయర్ ఎడి, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్ ఎసిబికి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. నిజామాబాద్‌లోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఎసిబి అధికారులు బుధవారం వలపన్ని వారిని పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. మోర్తాడ్ మండలం ధర్మోరా గ్రామానికి చెందిన రాజేందర్ అనే రైతుకు సంబంధించిన భూమి నాలా కన్వర్షన్ చేసిన తర్వాత పంచనామ సర్టిఫికెట్ కోసం కొన్ని రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. సర్టిఫికెట్ కోసం జూనియర్ అసిస్టెంట్ రహీమా, సూపరింటెండెంట్ వెంకటేశ్ రూ. 5000 తీసుకున్నారు. ఎడికి మరో రూ.పది వేలు ఇస్తేనే సర్టిఫికెట్ ఇస్తామని చెప్పడంతో బాధిత రైతు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. బుధవారం ఎడి శ్యామ్ సుందర్‌కు డబ్బులు ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ముగ్గురిని విచారణ చేసి కరీంనగర్‌కు పంపినట్టు ఎసిబి డిఎస్‌పి, సీఐ శ్రీనివాస్, నాగేష్ తెలిపారు.

విడిపోయిన గూడ్స్ రైలు బోగీలు

- గార్డ్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పై నుంచి వస్తున్న ఓ గూడ్స్ రైలు.. మహబూబాబాద్ జిల్లా కే సముద్రం-ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు లింక్ తెగిపోవడం గమనించిన క్యాబిన్ గాడ్.. లోకో పైలెట్‌ను అప్రమత్తం చేయడంతో ప్రమాదాన్ని తప్పించాడు. ఇంజన్‌తో కూడిన గూడ్స్ రైలు కేసముద్రం నుంచి వరంగల్ బయలుదేరి వెళుతున్న క్రమంలో కొన్ని బోగీలు ఇంజన్ నుంచి వేరు బడ్డాయి. అలా రైలు.. ఓ కిలో మీటర్ మేర ప్రయాణం చేయడంతో గమనించిన క్యాబిన్‌లో ఉన్న గార్డు అప్రమత్తతతో వెంటనే లోకో పైలెట్‌కు సమాచారం ఇవ్వడంతో రైలు ఆపారు. ఆపై విడిపోయిన బోగీలను ఇంజన్‌తో ఉన్న మరో బోగీలకు తగిలించుకొని ప్రయాణం కొనసాగించారు. ప్రమాదం తప్పడంతో లోకో పైలెట్లు, క్యాబిన్ గార్డు ఊపిరి పీల్చుకున్నారు.

సోలిపేటకు మంత్రి హరీశ్ నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లాకు చెందిన మాజీ ఎంపి సోలిపేట రామచంద్రారెడ్డి మరణించడం పట్ల రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాదులో సోలిపేట రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలతో నివాళులు అర్పించారు.

గ్రూప్-1, 2పై ఉచిత అవగాహన సదస్సు

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో నిర్వహించనున్న గ్రూప్-1, గ్రూప్ -2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఉచిత అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు అమిగోస్ 21 సెంచరీ ఐఎఎస్ అకాడమీ యాజమాన్యం తెలిపింది. అశోక్‌నగర్‌లోని తమ అకాడమీలో జులై 2న ఉదయం 9 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొంది. ఈ సదస్సులో ఆయా పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రిపరేషన్ స్ట్రాటజీ, నోట్స్ మేకింగ్, సమయపాలన తదితర అంశాలపై సీనియర్ అధ్యాపకులచే సమగ్ర అవగాహన కల్పించబడునని వెల్లడించింది. గ్రూప్-2 ప్రిలిమ్స్ రాష్ట్ర స్థాయి మాక్ పరీక్షను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నామని పేర్కొంది. ఆసక్తి కలిగిన వారు పూర్తి వివరాలకు 04035052121 ఫోన్ నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపింది.

ప్రాజెక్టులు సరే... కాలువలేవీ!?

- బ్రాంచ్ కెనాళ్లు, ఫీల్డ్ ఛానళ్లను నిర్మించరా ?
- వృథాగా సముద్రంలోకి సాగు నీరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ అనగానే సాధారణంగా నీళ్లు, నిధులు, నియామకాలు మనకు గుర్తొస్తాయి. అలాగే ప్రాజెక్టులు అనగానే బ్రాంచ్‌కెనాళ్లు, ఫీల్డ్ ఛానళ్ల గుర్తుకు రావాలి. కానీ, అలా జరగడం లేదు. ఎద్దును కొని పగ్గానికి భయపడ్డట్టు ఉంది పరిస్థితి. భారీ ప్రాజెక్టులు కడుతున్నా ప్రభుత్వాలు, పిల్ల కాలువలను మరిచిపోతుంటాయి. దీంతో ఆశించిన లక్ష్యం ఆమడదూరంలోనే ఉంటోంది. దీంతో ప్రజాధనం సద్వినియోగం కావడం లేదు. ప్రాజెక్టులు రాష్ట్ర వ్యవసాయ రంగంలో భారీ మార్పులకు కారణమవుతున్నాయి. భూగర్భ జలాలు పెరగడానికి ఊతమిస్తున్నాయి. ప్రభుత్వాల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ధనదాహం మూలంగా విలువైన జనం సొమ్ము ప్రాజెక్టుల్లోనీ నీళ్లల్లో కొట్టుకుపోతోంది. ఆనక ఆ భారం ప్రజల నెత్తిమీద మోపాల్సి వస్తోంది. పూర్తిస్థాయిలో సాగునీటి ప్రాజెక్టులను నిర్మించని కారణంగా ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కిలా ఉంది పరిస్థితి. ప్రమాణాల మేరకు ప్రాజెక్టులు కడితే ఆర్థిక నష్టాలు, కష్టాలు ఉండవని సాగునీటిరంగ నిపుణులు చెబుతున్న మాట.

ప్రాజెక్టు అంటే..

పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) ఆమోదం పొందిన వెంటనే నిర్ణీత కాలంలో పూర్తి చేయాలి. అప్పుడే అది సమగ్ర ప్రాజెక్టు అవుతుంది. కానీ భూసేకరణ జరగలేదని, బిల్లులు ఇవ్వడం లేదంటూ కాంట్రాక్టర్లు అదనపు నిధుల కొరకు వెంపర్లాడుతూ అంచనాల సవరణ (రివైజ్డ్ ఎస్టిమేట్లు) పేరుతో డిపిఆర్‌లో ఉన్న మొత్తం కంటే నాలుగైదు రెట్లు పెంచిన సందర్భాలూ ఎన్నో.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువలు రెండో విడతకు సంబంధించి 77 కిలోమీటర్లు ఉన్నాయి. ఇందులో డిబిఎం (మానేరు వెనుక పంపిణీ) అధికం. వర్ధన్నపేటలోని ఆకేరుసాగు నుంచి ప్రారంభమై, మూసివరకు సాగుతోంది. పంపిణీ కోసం దాదాపు బ్రాంచ్‌కెనాళ్లు 20 వరకు ఉన్నాయి. వీటికి ఫీల్డ్ ఛానెళ్లు చాలా ఉన్నాయి. 2.30 లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు ఈ కాలువలు వినియోగిస్తారు. సుమారు 30 ఏళ్ల తర్వాత వీటిని తవ్వారు. దీంతో తుమ్మలు (చెట్లు) మొలిచాయి. అప్పట్లోనే రూ.220 కోట్లు ఖర్చయ్యాయి. అవినీతి జరిగిదంటూ 12 మంది ఇంజినీర్లు, అధికారులను సస్పెండ్ చేశారు. ఆరు నెలల క్రితం శ్రీరాంసాగర్ నుంచి రెండో దశకు నీళ్లు వదిలారు. కానీ, నీటి ప్రవాహం సరిగ్గా సాగడం లేదు. ఆ కాలువలు, చెరువులు నింపడానికి అనువుగా లేకపోవడమే. లైనింగ్ కూలిపోయింది. ఇసుక, సిమెంట్, సలాక్ పెట్టి మరమ్మతులు చేయాలి. ఇకపోతే పాలేరు నుంచి భక్తరామదాసు డిస్ట్రిబ్యూటరీ లిఫ్ట్ నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 64 వేల ఎకరాలకు నీళ్లు వదిలారు. ఈ కాలువలూ సక్రమంగా లేవు. మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి 3.40 లక్షల ఎకరాలు, బీమా 2.03 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు 2.00 లక్షల ఎకరాలు, కొయిల్‌సాగర్ కింద 38,250 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రధాన ప్రాజెక్టుల పనులు పూర్తయ్యాయి. కానీ, లైనింగ్ పనులు చేయకపోవడం మూలాన నీరు వృథా పోతోంది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. భారీ ప్రాజెక్టులు పూర్తయినా, బ్రాంచ్‌కెనాళ్లు, ఫీల్డ్ ఛానెళ్ల నిర్మాణం పెండింగ్‌లో ఉంటుండటంతో సమస్య కొలిక్కి రావడం లేదు. ప్రధానమైన ఈ రెండు రకాల కాలువల నిర్మాణం ప్రభుత్వం చేయాలి. పిల్ల కాలువలను ఎక్కడిక్కడ స్థానికంగా ఉండే రైతులు చేసుకుంటారు.

ఎఎంఆర్ ప్రాజెక్టు..

ఎలిమినేటి మాధవ రెడ్డి (ఎఎంఆర్) ప్రాజెక్టు ఆయకట్టు రూ.2.70 లక్షల ఎకరాలు. ఈ మేరకు సాగునీరందించడానికి కాలువలు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం పంపింగ్ సైతం జరుగుతున్నది. బ్రాంచ్‌కెనాళ్లు లేకపోవడంతో కరువు ప్రాంతాలకు నీళ్లు అందడం లేదు. ఎప్పుడో నిర్మించిన కాలువలు కూలిపోయాయి. అలాగే 2004 నుంచి ఆదిలాబాద్ జిల్లాలో 14 మధ్యతరహా ప్రాజెక్టులు చేపట్టారు. అందులోనూ ఆరు ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ పథకం ఎఐబిపి కింద ఉన్నాయి. 2004లో చేపట్టిన ఈ ప్రాజెక్టులు పూర్తయినా, పంటకాలువలు లేకపోవడంతో ప్రాజెక్టుల నీరు వృథా అవుతోంది. ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ.50 లక్షల నుంచి రూ. మూడు కోట్ల వరకు కేటాయించారు. సుద్దవాగు, గొల్లవాగు, ఎర్రవాగు, మత్తడివాగు, సాత్నాల, ర్యాలీవాగు మరమ్మతులు చేయకపోవడంతో నష్టం జరుగుతోంది. కాలువల్లేక కేవలం పది వేల ఎకరాలకే నీళ్లు పారుతున్నాయి. 1203 సంవత్సరంలో నిర్మించిన పాకాల, రామప్ప, లక్నవరం ప్రాజెక్టుల కింద కాలువలు బాగా దెబ్బతిన్నాయి. నీరు సద్వినియోగం కావడం లేదు.

రెండున తెలంగాణ జన గర్జన సభ

- అదే రోజు భట్టి పాదయాత్ర ముగింపు.. పొంగులేటి చేరిక..
- హాజరుకానున్న ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ
- కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిక, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపు సందర్భంగా ఖమ్మంలో రెండో తేదీన నిర్వహించే తెలంగాణ జనగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎఐసిసి జనరల్ సెక్రెటరీ, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే పిలుపునిచ్చారు. ఈ సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరవుతున్నట్టు తెలిపారు. సూర్యాపేట జిల్లాలో పాదయాత్ర ముగించుకుని ఖమ్మం జిల్లాలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా సిఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర శిబిరం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి 'హాథ్ సే హాథ్' జోడో యాత్ర, ఎఐసిసి దిశా నిర్దేశం ప్రకారంగా సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క భగభగ మండే ఎర్రటి ఎండలను సైతం లెక్కచేయకుండా పాదయాత్రను చేశారని తెలిపారు. ఈ యాత్రలు కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి దోహదపడతాయన్నారు. ఖమ్మంలో జులై రెండో తేదీన నిర్వహించే తెలంగాణ జనగర్జన సభ ఏర్పాట్లు, పాదయాత్ర ముగింపు నిర్వహణ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ దగ్గరుండి కోఆర్డినేషన్ చేస్తారని చెప్పారు. ప్రజల సంపదను కెసిఆర్ లూటీ చేస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్రకు 600 వాహనాలతో వెళ్లడం వెనక దాగివున్న ఉద్దేశం ఏంటి అని ప్రశ్నించారు. వేల కోట్ల రూపాయలు ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేయడానికి కెసిఆర్‌కు ఎవరు ఇస్తున్నారని ప్రశ్నించారు. కెసిఆర్ ఖర్చు పెడుతున్న ప్రతి పైసా ప్రజలది కాదా అని నిలదీశారు. లిక్కర్ స్కాంలో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి ఇప్పటికి జైల్లోనే ఉన్నారని, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను సైతం విచారణ చేశారని, అదే స్కాంలో నిందితురాలుగా ఉన్న కల్వకుంట్ల కవితను ఇవ్వాలో, రేపో అరెస్టు చేస్తామని హడావిడి చేసిన దర్యాప్తు సంస్థలు ఎందుకు సైలెంట్‌గా ఉన్నాయని ప్రశ్నించారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి, కవిత ఇద్దరూ ఒక కేసులో నిందితులైనప్పుడు కవితను ఎందుకు అరెస్టు చేయడం లేదో ప్రజలు ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో మాజీ మంత్రి రాం రెడ్డి దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు, పిసిసి ఐటి సెల్ చైర్మెన్ మదన్ మోహన్ రావు, డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న తదితరులు ఉన్నారు.

సిఎం దృష్టికి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశం

- దక్కన్ సొసైటీకి మంత్రి హరీష్ హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి టి హరీశ్‌రావు హామీ ఇచ్చారు. ఈ మేరకు డెక్కన్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు బొల్లోజు రవి, ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాస్, కోశాధికారి అయ్యప్ప తదితరులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల ఇళ్ల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిన ప్రాధాన్యతను వివరించారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న హైదరాబాద్ సిటీ, రాష్ట్ర స్థాయి జర్నలిస్టులకు మాత్రం ఇళ్ల స్థలాల కేటాయింపు పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. చాలీచాలనీ వేతనాలతో జర్నలిస్టులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని గుర్తు చేశారు. ఉద్యోగరీత్యా ఇతర జిల్లాలు, ప్రాంతాల నుంచి హైదరాబాద్ వచ్చి పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇంటి అద్దె భారం గుదిబండగా మారిందని గుర్తుచేశారు.

పోడు భూముల సర్వేలో చేతివాటం!

- సర్పంచ్ సంతకం ఫోర్జరీ చేసిన కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్
- 650 మంది లబ్ధిదారులకుగాను 72 మందికే పాసు పుస్తకాలు
- రూ.రెండు వేల నుంచి మూడు వేలు వసూలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లాలో పోడు భూములు సాగు చేస్తున్న వారికి హక్కు పత్రాల జారీకి సంబంధించిన సర్వేల్లో కొంతమంది అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. గతేడాది నవంబర్‌లో పోడు భూముల సాగుదారుల నుంచి అర్జీలను స్వీకరించిన అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించారు. అక్రమాలకు తావులేకుండా సాంకేతికతను వినియోగిస్తూ భూముల కొలతలు తీసుకుంటూ అర్జీదారుల ఫొటోలను చిత్రీకరించారు. ఇప్పుడు పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేస్తున్నారు. ఇదే క్రమంలో ఒకరిద్దరు అధికారులు లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిసింది.

తిరుమలగిరి సాగర్ మండలం నాగార్జునపేటలో పోడుభూముల సర్వేలో ఆ గ్రామ కార్యదర్శి ఒక్కొక్కరి నుంచి భూమిని బట్టి రూ. రెండు వేల నుంచి మూడు వేలు.. 72 మంది నుంచి లక్ష రూపాయలకుపైగా తీసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. గ్రామంలో 650 మంది దరఖాస్తు చేసుకోగా.. 72 మందికి పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేశారని గ్రామస్తులు తెలిపారు. సర్పంచ్ లేకుండానే సర్పంచ్ ఉన్నట్టు గ్రామసభ తీర్మానం చేసి సర్పంచ్ సంతకాన్ని ఫోర్జరీ చేశారు. కార్యదర్శితో ఫీల్డ్ అసిస్టెంట్ కుమ్మక్కై ఇష్టం వచ్చినట్టు డబ్బులు దండుకుంటూ సమీప బంధువులకు మాత్రమే పట్టాలు ఇప్పించారంటూ గ్రామస్తులు ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి అసలైన లబ్ధిదారులకు పాస్ పుస్తకాలు ఇప్పించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పలువురు గ్రామస్తులు తెలిపారు.

సర్వే చేసి పాసు పుస్తకాలు ఇవ్వలేదు
అంగోతు సాలి(నాగార్జునపేట)

మాకు మూడెకరాల భూమి వుంది. అధికారులు సర్వే చేశారు. కార్యదర్శికి భూమికి సంబంధించిన కాగితాలు, జీరాక్స్‌లు ఇచ్చాం. మీకు రాస్తాం.. వెళ్లిపొమ్మని చెప్పారు. కానీ, డబ్బులు ఇచ్చిన వారికే రాసి పంపారు. మేము డబ్బులు ఇవ్వలేదు. మాకు పాసు పుస్తకం రాలేదు.

40 ఏళ్లుగా కబ్జాలో ఉంటున్నాం
నేనావత్ శంకర్ (నాగార్జున పేట)

మానాన్న, మా తాతలు 40 ఏళ్ల నుంచి కబ్జాలో ఉన్నారు. మాకు పాసు పుస్తకం రాలేదు. 600 మందికి పైగా లబ్ధిదారులను ఎంపిక చేస్తే 72 మందికే పాస్ బుక్కులు ఇచ్చారు. సర్పంచ్ సంతకం ఫోర్జరీ చేసి కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ వారి దగ్గరి బంధువులకు, డబ్బులు ఇచ్చిన వారికి పుస్తకాలు ఇచ్చారు. మేమంతా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

అండగా ఉంటాం.. ఆందోళన వద్దు

- జర్నలిస్టు తులసికి ఫెడరేషన్ సంఘీభావం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీనియర్ పాత్రికేయురాలు తులసిచందును తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర నాయకత్వం పరామర్శించింది. అండగా ఉంటామని, ఆందోళన పడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పింది. ప్రజల గొంతుకను ఇక ముందు కూడా వినిపించాలని కోరింది. సంఘ వ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు బి రాజశేఖర్, కార్యదర్శులు ఎస్‌కె సలీమ, ఇ చంద్రశేఖర్ బుధవారం హైదరాబాద్‌లో తులసిచందు నివాసంలో ఆమెను కలిశారు. ఈ సందర్భంగా ఆమె చేసిన వీడియోలు, అసాంఘిక శక్తుల బెదిరింపుల విషయమై చర్చించారు. వార్తాకథనాల్లో ప్రజాకోణాన్ని కొనసాగించాలని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. 'తనకు గత సంవత్సర కాలంగా బెదిరింపులు వస్తున్నాయని' ఫెడరేషన్ బృందానికి తులసి తెలియజేశారు. మతానికి సంబంధించిన వీడియో చేసినప్పటి నుంచే ట్రోల్స్ ప్రారంభమయ్యాయని వివరించారు. తనకు మీడియా అక్రిడిటేషన్ కార్డు లేదని, నిజాలను మాత్రమే ప్రజలకు చెప్పాలనీ భావించానని, ఆ పనిని ఇక ముందూ చేస్తానని తెలిపారు. ఇందుకు స్పందిన ఫెడరేషన్ నాయకత్వం' నిరభ్యంతరంగా మీ పని మీరు చేయండి. మేము మీకు వెన్నంటే ఉంటాం.మద్దతు ఇస్తాం. మీ తరపున పోరాడతాం' అని హామీ ఇచ్చారు. ఫెడరేషన్ బృందం తనకు సంఘీబావం చెప్పడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- మెరిట్ విద్యార్థులకు బహుమతుల ప్రదానం
- కార్యక్రమంలో మంత్రి కొప్పు ఈశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వరాష్ట్రంలో విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సెలెబ్రేటింగ్ సక్సెస్ మీట్ కార్యక్రమానికి మంత్రి హాజరై ప్రసంగించారు. నాడు పాలకల నిర్లక్ష్యం, వసతుల లేమితో కుదేలైన విద్యారంగం సర్కార్ నిర్ణయాలతో బలోపేతమయ్యిందన్నారు. తెలంగాణలో గురుకుల విద్యా వ్యవస్థను ఉన్నత స్థాయికి తీసుకొచ్చామని చెప్పారు. రాష్ట్ర ఆవిర్భవానికి ముందు 298 గురుకుల విద్యాసంస్థలు ఉండగా నేడు 1030కి పెంచుకోవడం జరిగిందన్నారు. కోట్లాది రూపాయల నిధులతో సకల వసతులు సమకూర్చుకుని కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా విద్యా బోధన జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న చర్యలతో గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రతి ఏటా గురుకుల విద్యా సంస్థల్లో ప్రవేశం కోసం పోటీ పెరుగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్రమే ఎడ్యుకేషన్ హబ్‌గా రూపుదిద్దుకున్నదన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలన్నీ తెలంగాణ వైపు చూస్తున్నాయని చెప్పారు. 'మనఊరు-మనబడి'తో ఎవరూ ఊహించనంతగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని మంత్రి చెప్పారు. ఇంగ్లీష్ మీడియంతో పాటు డిజిటల్ విద్యాబోధన అందించడం వల్ల ప్రతి ఏటా ఉత్తీర్ణతా శాతం పెరుగుతున్నదన్నారు. పోటీ పరీక్షల్లో గురుకుల విద్యార్థులు ప్రతిభచాటుతూ తెలంగాణ ఖ్యాతిని దేశ వ్యాప్తంగా తెలియజేస్తున్నారని అన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లల్లో మంచి గైడ్ లైన్స్ పాటించడంతో 95 శాతం ఉత్తీర్ణత సాధించారని, ఇది తెలంగాణ ప్రభుత్వం గొప్పతనం అన్నారు. జాతీయ స్థాయిలో మూడు వేల మంది విద్యార్థులకు వివిధ స్థాయిల్లో అవకాశం దక్కిందన్నారు. రాబోయే రోజుల్లో విద్యారంగంలో మరిన్ని విజయాలు తప్పక చేకూరుతాయని మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి రోనాల్డ్‌రోస్, ట్రైబల్ వెల్ఫేర్ విద్యాసంస్థల కమిషనర్ క్రిస్టినా తదితరులు పాల్గొన్నారు.

అవుటర్ రైలు ప్రాజెక్టుపై కసరత్తు

- రీజనల్ రింగ్‌రోడ్‌కు సమాంతరంగా నిర్మాణం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణకు అవుటర్ రింగ్ రైలు ప్రాజెక్టుపై రైల్వేశాఖ కసరత్తు ప్రారంభించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. త్వరలో రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా అవుటర్ రింగ్ రైలు ప్రాజెక్టు రానుందని వెల్లడించారు. రింగ్ రైలు ప్రాజెక్టు వివరాలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి అందించినట్టు కిషన్‌రెడ్డి చెప్పారు. ఆర్ఆర్ఆర్, అవుటర్ రింగ్ రైలుతో హైదరాబాద్‌కు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆర్ఆర్ఆర్ రూట్ విషయం 99 శాతం కొలిక్కి వచ్చిందన్నారు. హైదరాబాద్‌కు అవుటర్ రింగ్ రైలు ప్రాజెక్టు రావడం దేశంలోనే తొలిసారి అని పేర్కొన్నారు. వ్యాపార, రవాణా రంగంలో ఈ ప్రాజెక్టు ద్వారా గణనీయమైన మార్పు వస్తుందన్నారు. విజయవాడ, గుంటూరు, వరంగల్, మెదక్, ముంబయి రైల్వే లైన్లకు అవెటర్ రింగ్ రైలు కనెక్టివిటీగా ఉంటుందన్నారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. "ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించాయి. 2023 బడ్జెట్‌లో రూ.500 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. భూసేకరణ వేగంగా చేపట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ఆర్ఆర్ఆర్ వేగంగా పూర్తి చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. అవుటర్ రింగ్ రైలు ప్రాజెక్టు సర్వేకు కేంద్రం రూ.14 కోట్లు కేటాయించింది. ఘట్ కేసర్ నుంచి రాయగిరి వరకు ఎంఎంటిఎస్ రెండో ఫేజ్ చేపట్టాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. ఎనిమిదేళ్లయినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ఇస్తామన్న నిధులనూ ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాకపోయినా రూ.330 కోట్ల అంచనాలతో ఎంఎంటిఎస్ రెండో దశ ప్రారంభించాలని ప్రధాని మోడీ రైల్వే మంత్రిని ఆదేశించారు. రైల్వేశాఖ నిధులతో ఎంఎంటిఎస్ రెండో దశ పూర్తి కాబోతోంది.కేంద్ర ప్రభుత్వం అనేక ఆరోగ్య సంస్థలను తెలంగాణలో ఏర్పాటు చేస్తోంది. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ సంస్థను ఏర్పాటు చేసేందుకు కేంద్రం ముందుకు వచ్చింది. ఇప్పటివరకు ఎన్‌సిడిసి కోసం రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించలేదు. భూమిని కేటాయిస్తే భవన నిర్మాణం చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. దీనిపై ముఖ్యమంత్రికి లేఖ రాస్తున్నా. తెలంగాణరాష్ట్రానికి 50 ఏళ్లకు గాను వడ్డీలేని రుణ సాయం రూ.2,102 కోట్లు కేంద్రం ప్రకటించింది. వివిధ రంగాల వారీగా మౌలిక సదుపాయాలు మెరుగు పరచుకునేందుకు ప్రత్యేక ఆర్థిక సాయాన్ని కేంద్రం ప్రకటించింది. యుటిలైజేషన్ సర్టిఫికెట్స్ ఇస్తే పెండింగ్ నిధులు ఇచ్చేలా కేంద్రం చర్యలు తీసుకుంటుంది" అని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

తగ్గిన సీజనల్ వ్యాధులు

- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గతంతో పోలిస్తే రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు చాలా వరకు తగ్గాయని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యాలయంలో ఆయన జిల్లా వైద్యారోగ్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మిషన్ భగీరథ అమలుతో కలుషిత నీటి ద్వారా వచ్చే వ్యాధులు దాదాపు తగ్గిపోయాని తెలిపారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా కీటకాల ద్వారా వచ్చే వ్యాధులు చాలా వరకు తగ్గాయనీ, అక్కడక్కడా వెలుగు చూస్తున్నాయని చెప్పారు. ఆ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మలేరియాను గుర్తించే 8 లక్షల రాపిడ్ కిట్లు, డెంగీని గుర్తించే 1.23 లక్షల ఎలిజా కిట్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. 26 ఆస్పత్రుల్లో బ్లడ్ కాంపోనెంట్ మెషిన్లు సేవలందిస్తున్నాయని వివరించారు.

ప్రజారోగ్యానికి అధునాతన చికిత్స

- హోంశాఖ మంత్రి మహమూద్ అలీ
- ఉస్మానియా ఆస్పత్రి అధునాతన చికిత్సల థియేటర్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా ఆరోగ్యానికి అధునాతన చికిత్సలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలోని జీహెచ్‌ఎంసీ బ్లాక్ (ఓటీ కాంప్లెక్స్) 3వ అంతస్తులో కొత్తగా ఏర్పాటు చేసిన సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ ఆపరేషన్ థియేటర్, పునరుద్ధరించిన జనరల్ సర్జరీ ఓపీ, లింగమార్పిడి క్లినిక్ (సౌకర్యం), పెయిన్ క్లినిక్ (సౌకర్యం)ను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతి హోల్కర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ట్రో సర్జికల్‌లో మరింత అధునాతన చికిత్సలు నిర్వహించేందుకు ఈ థియేటర్ విభాగం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. లింగ మార్పిడి, పెయిన్ క్లినిక్ అధునాతన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వైద్యంలో ప్రావీణ్యం, అనుభవం గల వైద్యులు అధునాతన చికిత్సలు అందిస్తూ ప్రత్యేకతను చాటుతున్నారని అభినందించారు. ఆస్పత్రిలో ఉచితంగా అందిస్తున్న అధునాతన వైద్య చికిత్సలు ప్రజలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శంకర్ యాదవ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ శశికళారెడ్డి, అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ బి.త్రివేణి, ఆర్ఎంఓ- 1 డాక్టర్ బి.శేషాద్రి, హెచ్ఓడి, సర్జికల్ జీ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం, డాక్టర్ మధుసూధన్, హెచ్ఓడి ఎండోక్రినాలజీ, డాక్టర్ రాకేశ్ సహాయ్, హెచ్ఓడి, అనస్థీషియా విభాగం, డాక్టర్ పాండునాయక్, హెచ్ఓడి, జనరల్ సర్జరీ విభాగం, డాక్టర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'లో వికలాంగులకు ఐదు శాతమివ్వాలి

- మంత్రి వేములకు రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గృహలక్ష్మి పథకంలో వికలాంగులకు ఐదు శాతం కోటా కేటాయించాలని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కె.వాసుదేవరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సమాజానికి ఎంతో కృషి చేసిందని కొనియాడారు. దేశంలోనే వికలాంగులకు అత్యధికంగా పింఛన్ ఇస్తున్న ఘనత సిఎం కెసిఆర్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల మంది వికలాంగులున్నారనీ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని సంక్షేమ పథకాల్లో కూడా వికలాంగులకు రిజర్వేషన్ అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు. గృహలక్ష్మి పథకంలోనూ ఐదు శాతం కోటా కేటాయించాలని కోరారు.

మోడీ దోస్త్ అంటున్నారు కదా.. ఎందుకడగటం లేదు?

- పివికి భారత రత్నపై కెసిఆర్‌ను ప్రశ్నించిన బండి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'మాజీ ప్రధాని పివి నర్సింహారావుకి భారతరత్న ఇవ్వాలనే అంశం సంగతి తరువాత చూద్దాం. ముందు పివి ఘాట్‌కు వచ్చి నివాళి అర్పించమనండి. మోడీ నా దోస్త్ అని కెసిఆర్ పదేపదే అంటున్నారు కదా.. భారతరత్న ఇవ్వాలని ఎందుకు అడగడం లేదు?' అని సిఎం కెసిఆర్‌ను బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. పివి 102వ జయంతి సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని పివి ఘాట్‌లో ఆయనకు బండి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బిజెపి తమిళనాడు సహాయ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ కోశాధికారి శాంతికుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధులు ఎన్‌వి సుభాష్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గీతామూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ..ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకోవడమే కేసీఆర్ పని అని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్రాహ్మణ ఓట్లు చీల్చేందుకే ఆనాడు కెసిఆర్ పివి జపం చేశారన్నారు.

బూత్‌ల వారీగా పార్టీ బలోపేతానికే విస్తారకల రాక : బండి

'రాష్ట్రంలో అధ్యక్షుడి మార్పు ఒట్టిమాటే. తరుణ్‌చుగ్‌తో సహా అనేకసార్లు జాతీయ నాయకులు మార్పు ఉండదని చెప్పినా తప్పుడు వార్తలు ఆగడంలేదు. ఆ వార్తలన్నీ చూసీచూసీ అలవాటైపోయింది. దీన్ని తమ కార్యకర్తలెవ్వరూ పట్టించుకోవట్లేదు' అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్ అన్నారు. 'మేరా బూత్ సబ్‌సే మజ్బూత్' కార్యక్రమంలో పార్టీ బలోపేతం కోసం బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చిన విస్తారక్‌లకు ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీని బూత్‌ల వారీగా తమ పార్టీని బలోపేతం చేసేందుకే ఆయా రాష్ట్రాల నుంచి 650 మంది విస్తారక్‌లు తెలంగాణకు వచ్చారని తెలిపారు.